# అభాగ్యులు

ఆరుమిల్లి విశ్వనాధరావు

(గతసంచిక తరువాయి)

●

అంటూ కించిత్ జ్ఞానంలేకండా, కొంచెమయినా అర్ధంచేసుకోకండా-తాముత్రాత్రులు యెవరు చూడకండా, చూస్తారేమో అని నెత్తిమీద ముసుగులు వేసుకుని...భయపడుతూ, భయపడుతూ, రహస్యంగా వాళ్ళయిళ్ళల్లో ప్రవేశించి, డబ్బిచ్చి (ఆ రాత్రికిమటుకే) వాళ్ళసౌందర్యాల్ని, యవ్వనాల్ని కొనుక్కుని, జంకుతూ అనుభవిస్తే అది తప్పులేదు. ఎవరూ వేలుపెట్టి చూపించరు. కనీసం వాళ్ళను చూసి గుసగుసలుకూడ చెయ్యరు. ఇవి నీతిదాయకంగా నిలబడ్డవాళ్ళ కులగౌరవాలు, వంశమర్యాదలు ...ఒక ముగ్ధహృదయని, కులవృత్తి అనే నరకంలోనికి త్రోసివేయబడుతున్న ఒక అబలని సంఘాన్ని ధిక్కరించి,బహిరంగంగా ఆదర్శంగా వివాహమాడి, ఒకరి ప్రసక్తితో నిమిత్తంలేకండాకాపురంచేస్తోంటే, యీలోకంలో అది యెవరుచెయ్యని గొప్పతప్పు. ఈ నీతివంతులదృష్టిలో అపరాధం పైగా నువ్వుకులటవట. పరిహసించటం, కోతుల్లా వెక్కిరించటమూను... నాలుగుగోడలిమధ్యా రహస్యంగా వ్యభిచారంసాగించే వీళ్ళ భార్యలంతా, పతివ్రతలు, ఉత్తమశ్రేణికివచ్చే కులస్త్రీలు...వాళ్లుచేసిందాన్ని యెవరూ తప్పుఅనరు. (యెవరూ చూడకండా రహస్యంగా చేస్తున్నారుగనుక) ఆస్త్రీ ఎవరికీ తెలీకండా ఎన్నిపనులు చేసుకున్నాసరే తగూలేదు. అటువంటి వాళ్ళకంతా మంచి అభిప్రాయి ఇస్తుందిలే.

వాళ్ళస్వార్థాలకి ఉపకరించే యీశాసనాలూ, యీఅధికారాలు, ఎవరిచ్చారో తెలీదుమరి !

శశీ, ఇలాటివాళ్ళనంతా, ఎందుకు లెక్కచెయ్యాలి మనం? వీళ్ళంతా కూటమై మనల్ని బహిష్కరించారు...మనం వీళ్ళని నిషేధించాం. వీళ్ళభయం యెవరికి?

వీళ్ళంతా

అంధుడు దారికనుపించక రోడ్డమ్మట అల్లాడుతోంటే, సరియైనమార్గానికి త్రిప్పేబదులు ముండ్లలోనికి తీసుకుపోయి, రాళ్లురువ్వి చప్పట్లుకొట్టే ప్రముఖులు. ఈతరానివాడు నీటిలోపడి మునిగిపోతోంటే—అదో సినిమాలాచూసి వినోదిస్తూ గట్టుమీదనిల్చుని నవ్వేవెధవలు...తోటిమానవుని దీనస్థితి గుర్తించలేని వీళ్ళంతా—భగవద్భక్తులు, నీతివర్తనులు, ధర్మప్రభువులూ, దానకర్ణులూను. ఛీ! ఛీ!! వాళ్ళ ప్రస్తావనకూడ తేకూడదు. ఇటువంటివాళ్ళనే యీ లోకం మెచ్చుకునేది. ఇటువంటివాళ్ళకే యీమానవనిర్మితమైన సంఘంలో గౌరవాలు, మర్యాదలు...శశీ నీదింకా యివన్నీ తెలుసుకోలేని చిన్నిహృదయం.”

ఆయనిలా ఉద్రేకంగా మాట్లాడుతుంటే తను ఆశ్చర్యపడేది.

ఆయనాతనూ యేసినిమాకయినా వెడుతూంటే తమనిచూసి తమవెనుక—గుసగుసలాడేవాళ్ళూ, పకాల్ననవ్వేవాళ్ళు, యెవరిపేరో మధ్యనుపెట్టి నిందించేవాళ్ళూ...యిలా రకరకములుగా యీమూర్ఖులు... తను భరించలేకపోయింది. ఆమాటలన్నీహృదయకుహరంలోసొచ్చి వేధించి బాధించేవి.ఆయన నిర్విచారంగా నవ్వేసి ఊరుకునేవారు.

ఈవిధంగా ఆయనతో తనజీవితం అయిదుసంవత్సరాలు అయిదురోజుల్లా ఆనందంగా గడిచిపోవటం, ఆయన యెవరినీ లెక్కచేయకండా తనని పుష్పాలమధ్య కష్టాల్ని దరిజేరనివ్వకండా సుఖపెట్టటం. ఒక్కసారిగా అనుకోకండా తనని, తన చిట్టి

తల్లి శారదని దుఃఖాల్లో ముంచేసి కలరాదేవతకి ఆహుతై పోవటం, వున్న వొక్కయింటిని ఋణదాతలు ఆక్రమించుకోవటం, తను, తనమూడేళ్ళశారద పంచల పాలయి పోవటం. తను జీవితాన్ని సాగించటానికి తప్పనిసరిగా కొందరియిళ్ళల్లో సంగీతపాఠాలు ప్రారంభించటం. తనసౌందర్యం, తనయవ్వనం తనకు విరోధమై...కొందరు కామాంధులు తన్నుకోరటం...తను నిరాకరించి ఆపాఠాలుకూడా మానుకోవటం, లేసులు కుట్టుకుంటో చేత్తో బట్టలవీ కుడుతో...ఒకపూటతిని ఒకపూట తినకా తనశారదను పదునాలు గేండ్లదానిగా చేయటం.

ఇవన్నీ ఒక్కొటొక్కటిగా గత తన జీవిత మందలి దృశ్యాలు...యోచన్లు...మనోవీధిలో ప్రవేశించాయ్.

ఇరువది రోజుల్నుంచి తను వ్యాధిగ్రస్తయై మంచమెక్కింది. ఇప్పుడు తనగురించి, తన చిన్ని శారద, అమాయక ముద్దుబాలిక శ్రమపడుతోంది. బెంగతో మొహం వ్రేలాడేసింది. అహర్నిశలు తన మంచంవద్ద కూర్చుని తనకి సేవలుచేస్తోంది తన చిన్ని శారద. ఇంట్లోని చెంబూ గిన్నె అమ్ముకుని యెలానో పదిరోజులు కాలక్షేపం చేసారు. ఇరుగు పొరుగు నున్న మంచివాళ్లు నాలుగయిదురోజులు అప్పులు యిచ్చారు. ఇక వీళ్లిలానూ తీర్చేస్థితిలోలేరని వాళ్లూ యివ్వటం మానేశారు. అవును అప్పనేది ఒకరోజు రెండురోజులు, రోజూ యెవరిస్తారు? మరీ రెండు రోజుల్నుంచి తన చిట్టితల్లి పస్తు. గుప్పెడు మెతుకులయినాలేవు. తనకీరోజు గడిచేట్టులేదు. జబ్బు మరీ యెక్కువై విషమస్థితికి వచ్చేసింది. తనకివి అంత్య సమయాలుగా కనిపిస్తున్నై. తన యీ అంత్య సమయంలో తన చిట్టితల్లిని ఆఖరుసారి హృదయంమీదికి తీసుకుని ముద్దుగొంటూ, తొందరపడుతూన్న యీ ప్రాణాల్ని విడిచిపెట్టివేయటానికి, తనతల్లి, తను ప్రాణాధికంగా చూసుకునే తన శారద దగ్గరలేదు. చెప్పకుండా వెళ్ళింది. ఎక్కడికి వెళ్లిందో? ఈ వురుముల శబ్దంలో, ఆకాశం చిల్లులుపడిందా అన్నట్టు భయంకరంగా కురుస్తూన్న యీ వర్షంలో...యెక్కడికి వెళ్ళిందో? తనకి తెలీదు. ఎక్కడికిపోయిందో అని తన హృదయం హడలిపోతుంది? మందుకోసం ...సీసాతీసుకు ఆ ధర్మాస్పిటల్‌కు వెళ్ళిందేమో? పిచ్చితల్లికి అమ్మంటే యెంతప్రేమ? సారంలేని ఆనీళ్ళవల్ల ప్రయోజనంలేదని నాతల్లి చిన్నిహృదయానికి తెలీదు. ఆనీళ్లకోసం వాళ్లు దయతల్చి యిచ్చే వరకూ, ఆ సీసా చేత్తోపట్టుకు అక్కడ నిల్చుంటుందికద.


# ఉర్దూ తెలుగు స్వబోధిని

నిజాం రాష్ట్రములోని ప్రతి ఆంధ్రుడు ఉర్దూ రానిచో చాల కష్టపడవలసి యున్నది. రాష్ట్రపు ప్రతి కార్యము ఉర్దూలోనే జరుగుచుండును గాన ఉర్దూ ప్రతిఆంధ్రుడు నేర్చుట అత్యవసరము. ఉర్దూ తెలియని ప్రతి మనుజుడును తెలుగు తెలిసిన ప్రతి మనుజుడును నేర్చుకొనతగినది.

ఇట్టి బాధనివారణకై "ఉర్దూ తెలుగు స్వబోధిని" యను కొనియాడదగిన చక్కని పుస్తకము నూతనముగా ప్రచురింపబడెను.

—: వలయువారు :—

శ్రీ రామా బుక్ డిపో,
మార్కెటువీధి :: సికింద్రాబాద్.

పేజీలు 140. వెల రు. 1-8-0.

దగ్గూ ఆయాసం యెక్కువయింది. శ్లేష్మం అడ్డపడి శ్వాసనాపేస్తోంది. ఇంటి వెలుసుల్లోంచి పడే వర్షధారలు తన్ను తడిపేస్తున్నాయ్. లేవటానికి శక్తిలేదు. లేచినా వెళ్లేదెక్కడికి? ఇల్లంతా వర్షమే. తన శారద యేమైపొయ్యిందో? తను చనిపోతే దాన్ని యెవరుచూస్తారు? రాక్షసాంశ సంభూతులైన స్వార్థపరులమధ్య నాతల్లి యే అవస్తలకు, యే యిబ్బందులకు పాల్పడుందో? రెండురోజుల్నుంచి పస్తయినా, నాతల్లి ఆకలన్నమాట, అన్నమన్నమాట యెత్తలేదుకద. ఆకలితో దెబ్బలాడుతూ, యెంత ఓపికపట్టిందో నాతల్లి.

శారదా? యీ నిర్భాగ్యురాలి కడుపున పుట్టినందుకేకదూ? నీకీ అవస్తలు, చిన్నితనంలో నీకీ కష్టాలు...అబ్బా...యికమీదట...నీ చిన్నినోటితో 'అమ్మా' అని యెవర్నిపిలుస్తావు తల్లీ? నువ్వు యేకాకివి...రెక్కలురాని పక్షివి...నీకీ ప్రపంచంలో యెవరూలేరు. ఎవరేనావున్నా సంఘంపాదాలకి దాసోహాలు చేసేవీళ్ళంతా, లేనివాళ్ళతోనే సమానం.

ఒక్కొక్కవిషయం...తన మరణసమయం...తన శారదభావి...యెలా మారుతుందో...తల్చుకొంటూంటే...ఆ భాధాహృదయం...పగిలిపోవటానికి సిద్ధమౌతోంది.

ఆరోజున తనతల్లి పరిస్థితులు మరీ విషమించిపోవటం, శారదను మరీ హడలెత్తించేశాయ్. రెండు రోజుల్నుంచి తనకి అభోజనం...యీ వుపవాసాలు యెన్నాళ్లో? ఆకలయినప్పుడల్లా కసిన్ని మంచినీళ్ళు త్రాగి కాలక్షేపం చేస్తోంది. ఆకలికి మంచినీళ్లు యేం వుపయోగిస్తయ్? కాని యేంచెయ్యటం? వంట్లో నీరసం ప్రవేశించింది. శక్తులన్నీ సణగిపొయ్యాయ్. ఆకలిబాధ యెక్కువైపోయింది. చుట్టుప్రక్కలవాళ్ళు కళ్ళతో యీబాలిక దుస్థితిచూసికూడ కనికరించలేకపొయ్యారు. ఏవొక్కరికీ దయనేది కలుగలేదు. వాళ్ళకసలు హృదయాలంటూ వుంటేకదూ? అవిధాత వీళ్లగుండెల్ని రాతితో సృష్టించాడు. ముప్పొద్దు యిళ్లల్లోనూ, అది సరిపోక ఆయ్యరు హోటల్సులో పీకలవరకూతిని 'త్రేవ్' మని త్రేన్చుకునే యీ మహానుభావులందరికీ ఆకలిభాద యేం తెలుస్తుంది? ఎట్లా తెలుస్తుంది? కనీసం వస్తున్నది ఒక్కరోజయినా ఆఖరికి ఒక్కపూటయినా వుంటే కదూ! బాధ కన్పించటానికి.

అమ్మబాధను చూడలేకపోయింది. కళ్లమ్మట నీళ్లు గిర్రునతిరిగినై. మరి అక్కడ వుండలేకపోయింది. నీరసించిపోయి, శుష్కించుకుపోయి కళ్ళుమూసుకుపరున్న అమ్మతో అయినా చెప్పకండా అలా నీరసంతోనే బయలుదేరింది, యెక్కడికో? యేం చేదామనో? ఆ చిన్ని హృదయానికే తెలియాలి. నాలుగు ఫర్లాంగులుదూరం, కళ్ళు తిరిగిపోతోంటే, కాళ్లు తేలిపోతోంటో అడుగుల్లో అడుగులు వేసుకుంటో నడిచివెళ్లింది. ఆమేడను చేరుకుంది. బాధాక్రాంతమైన హృదయంతో, అది ఆవూళ్ళో పెద్దపేరును సంపాయించిన ఓ డాక్టరుగారిది. అప్పుడే ఓ అందమయిన కారువచ్చింది. గుమ్మంలో ఆగింది. కారు


సి. జి. ఆర్.
రింగ్‌వరమ్
ఆయింటుమెంట్
సుప్రసిద్ధ పైపూత ఔషధం

ఒక్కపూటతోనే గుణం కనిపిస్తుంది.

తామరున్నచోట రాత్రిపూట బాగా మర్దించి ఉదయాన్నే సబ్బుతో కాని శీకాయి పొడితో గాని కడుగవలెను. వెల సీసా 1-కి 0-8-0.

స్టాకిస్టులు: ఏ. స్వర్ణ & కో.,
313, మింట్ స్ట్రీట్, జీ. టి., మద్రాసు.

లోంచి డాక్టరుగారు దిగారు. గుమ్మంలోనే నిల్చుని బెదురుచూపులు చూస్తున్న దీనబాలిక శారదను చూసాడాయన. ఎవరో ముష్టిపిల్లనుకున్నాడు. తిన్నగా లోనికి వెళ్లిపోతున్నాడు. ఎందుకొచ్చావని ఆయన అడుగుతాడేమో అనుకుంది. పాపం! పిచ్చిపిల్ల! ఆయనకక్కా వాల్నా? రోజూ యిలాటి వాళ్లని తొంభైమందిని చూస్తుంటారాయన.

లోపలికి వెళ్లిపోతే మళ్ళా యీవలికిరాడేమో అనే భయంతో—ఆయన గడపదాటకండానే భయపడుతూ, భయపడుతూ, వణుకుతూన్న గొంతుకతో నెమ్మదిగా—"ఏ...మం...డీ!" అనీ అనటంతోనే ఆయన ఆగి వెనక్కి తిరిగి మామూలుధోరణిలోనే—"ఏం?" అని ప్రశ్నించాడు. అదీ కొంతనయమే వినిపించుకోనట్టు వెళ్ళకండా. ఆయన ప్రశ్నతో, కనుకొలకుల్లో నిండిననీళ్లల్లో—

"మాఅమ్మకి...చాల...జబ్బుగా వుందండీ!

"అయితే నన్నేం చెయ్యమంటావ్?"

మాఅమ్మకి జబ్బుగావుందని ఆమె చెబుతూంటే—ఆమె నిర్భాగ్యవేషాన్ని చూస్తూ వేసినప్రశ్న అది. మరోమరోధనికులువచ్చి మా·పలానావారికి జబ్బుగా వుందంటే ఆప్రశ్న అక్కడరాదు. డబ్బే యింపార్టెంట్...దయచెయ్యమని సోఫాలు చూపిస్తుంది. నిమిషాలమీద కాఫీ, టీలు సిద్ధపరుస్తుంది...కారులోతీసుకెడుతుంది. దొంగశాల్యూట్లు చేయిస్తుంది...ఎన్నైనా చేయిస్తుంది...ఇవన్నీచేసేది ఆడబ్బే. డబ్బులేని ఆ నిర్భాగ్యురాలువంక సరిగా మాట్లాడనివ్వదు...సరికదా కన్నెత్తయినా చూడనివ్వదు. ఇదీలోకం; ఇదీ సంఘం; ఇదీ గొప్పదనం; అంతకీకారణం డబ్బే. డబ్బున్నవాడు అంబలిత్రాగితే నూడిద...అదే దరిద్రుడయితే లేక...అంతేతేడా. వాడు పలికేవన్నీ అబద్ధాలయినా, యీ న్యాయమూర్తులదృష్టిలో అవి నిజంక్రింద చెలామణిఅవుతయ్. వీడు సత్యంమాట్లాడుతున్నా విన్పించుకోక అబద్ధమంటారు. ఇంత క్రూరంగావుంది నేటిస్థితి. (సశేషం జూలైలో)


మదనకామేశ్వర లేహ్యము




బలవర్ధకమయినది. మేహమునిక్క నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తినికలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 1-12-0

రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు మూలవ్యాధి మొదలగు వాటిని హరించి కాలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 0-14-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాట్లాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం- పెరిదేపి, నెల్లూరుజిల్లా.



చేతిపనుల

వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, [illegible]ణ సంచ, అత్తరు, పన్నీరు, పప్పరమెంట్లు, మం[illegible]లు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు కొత్తపద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీగ్రంథముచూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము, ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,

12, అరుణాచలమొదలివీధి, 18, వీటు, మద్రాసు.